
గెలుపు నీదే
గుజ్జేటి గణేష్
SRINUJI......

నేస్తం: నన్ను మరచిపోకు!

నిన్ను ప్రలోభపరచి. నీలో కోరికల్ని నిద్రలేపి నిన్ను విరహతాపంతో దహింపజేసి నీ ఆశల సౌధాన్ని ఎలాంటి సంస్థలు లేకుండా పునాదులతోసహా పెకిలించివేసినందుకు నన్ను ఆజన్మాంతం దూషిస్తూ ఏవగించుకుంటూ శపిస్తూ ఉండిపో.

అంతేకాని నా తలరాత ఇలా రాసి ఉందన్న భావంతో మనసు శాంతపర్చుకొని నన్ను క్షమించకు నాపట్ల ఎలాంటి దయాదాక్షిణ్యాలకు చోటులేదు. నాది నికృష్టమైన బ్రతుకు ఈ భూమ్మీద బ్రతికే తరహాకాదు.

కాని ఏం చేయను.... ఏదో ఆశ నన్ను బ్రతకమని వెంటాడుతూ ప్రోత్సహిస్తుంది. ఎన్నో ఆశల సౌధాలు నా మనోఫలకంపై ప్రదర్శించి నన్ను ప్రలోభపరుస్తుంది.

అంతేకాదు ఇంకా ఏదో సాధించాలని ఇంకా ఎందర్నో మోసపుచ్చాలని అర్రులు చాస్తుంది.

నిజం! ఆరోజు నీ పతనానికి పునాది వేసిందికూడా నాలోని ఈ కిరాతకమైన ఆశే సుమా!

అందుకే చదువు సంస్కారం విస్మరించి సాటి ఆడదానినన్న ఇంగితజ్ఞానమైనా లేకుండా నిర్దాక్షిణ్యంగా నిన్ను ఆ రొంపిలో తోశాను. ఆ పెడత్రోవ పట్టించడానికి ఎన్నో యుక్తులు పన్ని నీ హృదయాంతరాల్లో తళతళ మెరిసే అద్దాల మేడలు నిర్మించాను.

నువ్వు కూడా ఎంత అమాయకంగా ఆ ఉచ్చులో చిక్కుకున్నావు నేస్తం! ఆ సమయంలో నువ్వయినా కాస్త తెలివి ఉపయోగించి నా సన్నాగాన్ని పసిగట్టి నన్ను చెప్పుచ్చుకొని కొట్టివుంటే నీకు ఈ రోజు ఈ దుర్గతి పట్టేదికాదు.

సరే అదంతా పోనీ నేస్తం! కాని రాత్రి నీ దయనీయస్థితి చూసి నా మనసు చలించిందంటే నువ్వు నమ్మకపోవచ్చు. నమ్మవు కూడా!

నువ్వు నమ్మినా. నమ్మకపోయినా ఇది మాత్రం నిజం! నిన్ను చూసిన మరుక్షణం నా అంతరాత్మ ఎంతో విలవిల్లాడింది. నాలోని సంస్కారం అవమానభారంతో తలొంచుకుంది.

ఏది ఏమైనా నేనొక నిర్ణయానికి వచ్చాను.

నీ పాదాలముందు మోకరిల్లాలని. నీ పాదాలను స్పృశించి క్షమాభిక్ష కోరాలని.

ఇందుకు నేను ఏ మాత్రం సిగ్గుపడ్డంలేదు ఎందుకంటే నా అభిమానం నీ ప్రస్తుత స్థితి కంటే ఎంతో అల్పమైనది.

* * *

ఉదయం!

పాలపొంగులాంటి ఉదయం!

దూదిపింజలాంటి ఉదయం!

తల్లి మనసులాంటి ఉదయం!

ఆ వేళ ఎవరో తన వీపుపై చటీల్మని చరుస్తూనే ఉలిక్కిపడి నిద్ర మేల్కొని లేచి కూర్చుంది శ్రావణి.

ఎదురుగా పార్వతమ్మ ముక్కుపుటాలెగరేస్తూ కళ్ళు పెద్దవిచేసి చూస్తూ నిలబడివుంది ఆవిడ అలా ఉగ్రరూపం దాల్చిందంటే ఏదో ఒక కారణం వుంటుంది. ఆ విషయం ఒక శ్రావణికే కాదు. ఆవిడ మోచేతి నీళ్ళు తాగుతూ అజ్ఞానుబద్ధులై బ్రతుకుతున్న అక్కడ 15 మంది ఆడపిల్లలకి తెలుసు.

ఆమె వాలకం గ్రహించిన శ్రావణి ఒక్కఉదుటున పక్కపైనుంచి లేచి ఒంటిమీద దుస్తులు సరిచేసుకోసాగింది.

ఇక చాలు సింగారింపు. తొందరగా తెముల్చుకొని తగలడు. వాళ్ళొచ్చి ఇప్పటికే అరగంట కావస్తుంది. కర్కశంగా ఆజ్ఞాపించి వెళ్ళిపోయింది పార్వతమ్మ.

శ్రావణి కళ్ళు ఒక్కసారి అశ్రుపూర్ణాలయ్యాయి. గుండెను ఎవరో నులిపెడుతున్నట్టు బాధగా నిట్టూర్చింది.

ఎంత బాధ పడ్డా. ఏడ్చిగగ్గోలు పెట్టినా పార్వతమ్మ మాటకు తిరుగుండదు. ఆ విషయం గత రాత్రే తను గ్రహించింది.

"నా ఒంట్లో ఓపిక లేదు....దయచేసి ఈ ఒక్క రోజుకు నన్ను ఒదిలి పెట్టండి" అని చేతులు జోడించి కళ్ళనీళ్ళు పెట్టుకొని ప్రాధేయ పడింది.

కాని. పార్వతమ్మ రాతి గుండె కరగలేదు "ఆ నంగనాచి నాటకాలన్ని కట్టి పెట్టు. ఇప్పటికే నీ పేరు మీద నలుగుర్ని బుక్ చేసుకొని అడ్వాన్సు తీసుకున్నాను. అయినా నా కిప్పుడు డబ్బు ముఖ్యంకాదు.... ....నా పరపతి ముఖ్యం! ఆ అడ్వాన్సు ఇచ్చిన వాళ్ళు ఎవరో కాదు....సంఘంలో ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఘరాన పెద్ద మనుషులు. ఇలాంటి వాళ్ళతోనే నా వ్యాపారం వృద్ధి చెందేది. అందుకని నోరుమూసుకొని రెడీ అవ్వు! కాదని మొండికేసి కూర్చున్నావంటే రెండ్రోజుల క్రితం సావిత్రికి పట్టిన గతే నీకూ పడ్తుంది." నిర్దయగా అంది

రాత్రి సంఘటన స్ఫురణకు రాగానే శ్రావణి ఆపాదమస్తకం కంపించింది. ఇప్పుడు ఆవిడకు తన దీన పరిస్థితి అనవసరం. ఆవిడ మాటే చెల్లాలి. కాదంటే సానుభూతి చూపి వదిలి పెట్టే దయార్ద్ర హృదయం ఆవిడకు లేదు. కాదని. ఎదిరించి భయపడి బతికే ధైర్యం తనకు లేదు.

"భగవాన్! ఎందుకు నన్నింకా బతికించి చంపుతున్నావు!" అంతరాత్మ బాధగా మూలిగింది.

హఠాత్తుగా ఆమె మనో నేత్రం ముందు. ప్రస్తుత తన నికృష్టపు బతుక్కి సాక్షిభూతంగా రాత్రి తను కన్న కలలు తాలూకు స్మృతులు తరంగితమయ్యాయి. ఆశ్చర్యంతో అలోచన సాగింది.

అంటే— తనలోని పైశాచిక శక్తిపై. అంతరంగంలో దాక్కొని ఉన్న అభిమానం ఇంకా ధ్వజమెత్తుతోందా? తనను పెడత్రోట పట్టించిన అజ్ఞానాన్ని జ్ఞానమనే నిప్పు దహిస్తోందా? సిగ్గు విడిచి బజారు కెక్కిన సంపటత్వాన్ని. సౌశీల్యం అపహించుకుంటోందా? తిష్ఠ వేసిన పిరికి తనాన్ని. ధైర్యం తరిమి కొడుతోందా?

లిప్తపాటు ఆమె పెదవులపై నిర్జీవమైన దరహాసం తళుక్కున మెరిసి మాయమైంది నిస్త్రాణమైన తన మస్తిష్కం నిద్రమత్తు కూడా అంత చైతన్యంగా కలగన్నందుకు క్షణ మాత్రం ఉల్లాసంతో ఆమె నేత్రాలు మెరిశాయి.

●



## ఇన్‌స్పెక్టర్ రాజ్

హిందీ చిత్రాల్లో ఇన్‌స్పెక్టర్‌గా తరచూ కనిపించే జగదీష్‌రాజ్ ఇప్పటికి 136 సినిమాల్లో ఆ పాత్ర ధరించారు. త్వరలో ఆతడు పోలీసు పాత్రలు పరిధి ధరించి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కే అవకాశముందని అంటున్నారు.